రాగి పంట సాగుకు అధిక ప్రాధాన్యత

మడకశిరరూరల్: రాష్ట్ర ప్రభుత్వం బోరు బావుల కింద రాగి పంట సాగు చేయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, నీటి సౌకర్యం ఉన్న రైతులు పంట సాగు చేయాలని మడకశిర మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, సర్పంచ్ కవిత తెలిపారు. శుక్రవారం మణూరు, సీ కొడిగేపల్లి, కల్లుమర్రి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాగి పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోరు బావుల కింద ప్రతి రైతు కొంత భూమిలో రాగి పంట సాగు చేయాలని కోరారు. రైతులకు సబ్సిడీతో రాగి విత్తనాలను ఆర్బీకేల్లో అందిస్తారన్నారు. ప్రభుత్వమే క్వింటాల్ రూ.3,578 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మారుతమ్మ, ఆర్బీకే సిబ్బంది, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మడకశిర: మాట్లాడుతున్న మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి



పరిగి: మాట్లాడుతున్న ఏఓ విజయభారతి

పరిగి: మండలంలో రాగి పంటను విస్తారంగా సాగు చేయాలని ఏఓ విజయభారతి తెలిపారు. శుక్రవారం మండలంలోని పైడేటి, పి. నరసాపురం, హొన్నంపల్లి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా పౌరసరఫరా శాఖతో అనుసంధానం చేసి, రాగి పంట సాగు చేసిన రైతుకు కనీస మద్దతు ధరగా రూ.3,578 కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమాలలో ఎంపీపీ సవిత ప్రభాకర్, మండల అగ్రిబోర్డ్ సలహా మండలి చైర్మన్ గోవిందరెడ్డి, అడ్వయిజరీ బోర్డు మెంబర్ ఆదినారాయణ, ఆర్బీకే సహాయకులు సింధూ, హరీష్‌రెడ్డి, ఆదిలక్ష్మి రైతులు పాల్గొన్నారు.



నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల : మండలంలోని వెంకటగిరిపాళ్యం పంచాయతీ మక్కాజిపల్లి తండాలో ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలివ్వండి

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రోడ్డులో రూ.కోట్లు విలువజేసే 668 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలివ్వాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు తహసీల్దార్‌కు శుక్రవారం విన్నవించారు. మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న విలువైన ఈ భూమిని కొందరు వ్యక్తులు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్ జిలానికి సన్మానం



తహసీల్దార్ జిలానిని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర(అగళి): అగళి తహసీల్దార్ జిలాని ఇటీవల పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో శుక్రవారం కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. వక్తలు జిలాని సేవలు కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ గురప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిబిరం

పరిగి: కొడిగెనహళ్లిలో కరాటే శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కరాటే కోచ్ జనార్దన్‌రెడ్డి కరాటేపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఎస్పీఎస్వీ కరస్పాండెంట్ శ్రీధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి



వెంకటశివారెడ్డి దంపతుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మలసముద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటశివారెడ్డి, ఆయన భార్య జయమ్మ గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి చేరుకొని మృతదేహాలు పరిశీలించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ

మడకశిర(అగళి): రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుకు ప్రభుత్వం వేరుశనగ విత్తన కాయలను అందిస్తున్నదని తెలిపారు. ఖరీఫ్‌లో పంట పెట్టుబడి కోసం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి రైతు భరోసా సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని వివిధ పంటల సాగులో మంచి దిగుబడులు సాధించాలని కోరారు. రాగి సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, సభ్యులు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఆడియో మెట్రీ ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి సంతోష్ హెగ్డే

పావగడ: స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో వినికిడి సమస్యలను కనిపెట్టే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన ఆడియో మెట్రీ యంత్రోపకరణాన్ని జస్టిస్ సంతోష్ హెగ్డే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతరుల బాధలు ఆవేదనలను తక్షణమే తెలుసుకుని వారికి సహాయ హస్తాన్ని అందించే స్వామి జపానంద అని శ్లాఘించారు. శ్రవణ సంస్థకు చెందిన లయన్ వీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నవజాత శిశువు నుంచి అందరికి శ్రవణం, తదితర వినికిడి సమస్యలను కనిపెట్టే అధునాతన ఆడియో మెట్రీ విభాగాన్ని స్థాపించడం పిల్లల ఆరోగ్యం పై స్వామిజీకి ఉన్న శ్రద్ధ కు నిదర్శన మన్నారు.

యేసుది శాంతి మార్గం



మాట్లాడుతున్న స్తోత్రం రాజు

హిందూపురం టౌన్: యేసుది శాంతిమార్గమని బైబిల్ మిషన్ సభ్యులు స్తోత్రం రాజు అన్నారు. మూడు రోజుల పాటు పట్టణంలోని లక్ష్మీపురంలో జరిగిన బైబిల్ మిషన్ సువార్త సభలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు లోబడిన వారిని దేవుడు దీవిస్తాడన్నారు. ప్రతి ఒక్కరూ యేసు మార్గంలో నడవాలని సూచించారు. ఏ మతం, వ్యక్తి, కులాన్ని దూషించరాదని, ద్వేషించరాదని అన్నారు. తెలియని విషయాలను దేవుడిని అడిగి తెలుసుకోవాలని బోధించారు. పాస్టర్ దేవరాజు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పరిశీలన

అమరాపురం: స్థానిక ఎమ్మార్సీలో భద్రపరచిన జగనన్న విద్యాక కానుక కిట్లను డీపీఓ విజయకుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఎంతమంది విద్యార్థులున్నారు, విద్యార్థులకు సరిపడా కిట్లు వచ్చాయ లేదా అని ఎంఈఓ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 60 ప్రభుత్వ పాఠశాలలు, 5,326 మంది ఉన్నారని, అందరికీ కిట్లు సరఫరా అయ్యాయని ఎంఈఓ తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు జేవీకే కిట్లను అందించాలని డీపీఓ సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని పంచాయతీలో పన్ను వసూలు ఎంతమేర చేస్తున్నారు, వైఎస్సార్ బీమా ఎంతశాతం పూర్తి చేశారు తదితర వివరాలను ఎంపీడీఓ మునిస్వామిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఈరన్న, సీఆర్పీలు పాల్గొన్నారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న డీపీఓ విజయకుమార్

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం



చౌళూరు మధుమతిరెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

హిందూపురం: మండల పరిధిలోని బీరేపల్లిలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతి రెడ్డి 'మమేకం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో కలియ తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రామక్రిష్ణ, వైస్ ఎంపీపీ రామాంజి, సింగల్ విండో రంగనాథ్, మాజీ సర్పంచ్ అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేంద్ర, రామక్రిష్ణ, విశ్వనాథ్, రమేష్, రామచంద్ర రెడ్డి, రాజా రెడ్డి, సుబ్బి రెడ్డి, అజయ్, ఓబుల్ రెడ్డి, లోకేష్, అనిల్, మజీద్, సోమశేఖర్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'హిందూపురం' అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల వద్ద వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌ను కలిసి హిందూపురం అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. సీఎం సానుకూలంగా స్పందించి సహకరిస్తామని చెప్పారన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా పట్టణ, గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామని, గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. పట్టణ, గ్రామాల్లో గుర్తించిన అభివృద్ధి పనులకు ఇప్పటికే అధికారులు నివేదికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారన్నారు. ప్రత్యేక నిధుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. మరో మూడు నెలల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండల కేంద్రంలోని 5, 6వ అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ మునిస్వామి తనిఖీ శుక్రవారం ఆకస్మికంగా చేశారు. ఈ సందర్భంగా పిల్లలు, అంగన్‌వాడీ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం స్టాకు వివరాలు, ఎంతమంది ప్రీస్కూల్ పిల్లలున్నారు, గర్భిణులు, బాలింతలు, తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని పిల్లలకు అందించాలని సూచించారు.

హెచ్‌ఎంలు బాధ్యతల స్వీకరణ

అమరాపురం: మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హేమావతి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా టి.విజయమ్మ, కె.శివరం వై.శ్రీనాథ్, అమరాపురం గాజుల రఘు, గౌడనకుంట శ్రీనివాస రెడ్డి, వలస ఇంద్రకరణ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పన

- లే అవుట్లను పరిశీలించిన డీఆర్డీఏ పీడీ నరసయ్య

పరిగి: ప్రభుత్వం జగనన్న కాలనీల్లో నిరుపేదలకు అర్హతల ఆధారంగా ఇళ్లు నిర్మించడంతో పాటూ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య తెలిపారు. శుక్రవారం ఆయన పరిగి మండల పర్యటనకు వచ్చి, కొడిగెనహళ్లి 1, 2 సచివాలయాల పరిధిలోని జగనన్న లేఅవుట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమంలో భాగంగా ప్రతి గ్రామంలోనూ నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల పట్టాలతో పాటు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, ఏపీఎం దేవానంద్ ఫిలిప్సన్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కొడిగెనహళ్లిలో ఇళ్లను పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ నరసయ్య

రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం అర్బన్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సౌత్ వెస్ట్రన్ రైల్వే మెంబర్ ఆదర్శకుమార్ కోరారు. ఈ మేరకు బెంగళూరు డీఆర్‌ఎంను ఆయన మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి స్టేషన్‌లో విద్యుత్ లేక పలు రైళ్లలో వచ్చిన, వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఓ వైపు వర్షం,మరో వైపు విద్యుత్ సరఫరా ఆగిపోయి ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. 25 కేవీ జనరేటర్ మంజూరైనా స్టేషన్‌కు తీసుకురాలేదని, జనరేటర్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. మౌళిక వసతులు కల్పించాలని, మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ

పెనుకొండ: పట్టణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయురాలిగా పద్మప్రియ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఉరవకొండకు బదిలీ కాగా, ఆయన స్థానంలో హెచ్‌ఎంగా పద్మప్రియ హిందూపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మామిడి తోటకు నిప్పు

పరిగి: మండలంలోని నేతులపల్లిలో శుక్రవారం లక్ష్మన్న అనే రైతుకు చెందిన మామిడితోటకు నిప్పంటించారు. విషయం తెలుసుకొని తోట వద్దకు వెళ్లగా అప్పటికే దాదాపు 70 చెట్ల వరకూ కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

12న వాహనాల వేలం

మడకశిర: మడకశిర సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 12న ఉదయం 10 గంటలకు పట్టణంలోని సెబ్‌స్టేషన్ వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. నిర్ణీత ధరలో 10 శాతం డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్, పాన్‌కార్డులతో హాజరుకావాలని కోరారు.

పాఠశాలలకు 'జగనన్న విద్యాకానుక' కిట్లు

లేపాక్షి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ఏపీ గురుకుల, కస్తూరిబా గాంధీ విద్యాలయాలకు 'జగనన్న విద్యాకానుక' పథకం చేర్చినట్టు ఎంఈఓ నాగరాజు శుక్రవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 5,335 మంది విద్యార్థులకు త్వరలో కిట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

విజిలెన్స్ విచారణ

చిలమత్తూరు: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విషయంలో విద్యుత్‌శాఖ అధికారులు అవినీతికి పాల్పడ్డారన్న రైతుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం మండలంలోని రొద్దంవారిపల్లి, కొడికొండ గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్ఐ రాజేశ్వరి మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆమె తెలిపారు.

నేడు కొండ రోడ్డు ప్రారంభం

పెనుకొండ: పెనుకొండ కొండ రోడ్డుకు శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రారంభోత్సవం చేయనున్నట్లు మండల వైఎసార్ సీపీ, టౌన్ కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ శుక్రవారం తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

హిందూపురం టౌన్: పట్టణంలోని పలు చోట్ల విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ కృష్ణవేణి శుక్రవారం పేర్కొన్నారు. కంసలపేట, కోట ఏరియా, పాండురంగనగర్, అంబేడ్కర్ నగర్, మెయిన్ బజార్, డీఎల్ రోడ్డు, రైల్వేరోడ్డు, పెనుకొండ రోడ్డు, ముక్కడిపేట, పరిగి రోడ్డు, హస్నాబాద్, ఆర్‌టీసీ కాలనీ, బాపూజీ నగర్, ఎంఎఫ్ రోడ్డు, ఆజాద్ నగర్, సత్యనారాయణపేట, బోయపేట, రహమత్‌పురం, నింకంపల్లి ఏరియాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలలకు జేవీకే కిట్ల సరఫరా

రొళ్ల: దొమ్మరహట్టి సమీపాన గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల నుంచి ఎంఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు 'జగనన్న విద్య కానుక' కిట్లను తరలించారు. మండలం వ్యాప్తంగా 65 పాఠశాలలు ఉన్నాయి. అందులో 4,126 మంది విద్యార్థులు చదువున్నారని ఎంఈఓ తెలిపారు. ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

పెనుకొండ: పింఛన్‌దారులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని లేనిపక్షంలో పింఛన్ అందదని పింఛన్‌దారుల సంఘం కార్యదర్శి, విశ్రాంత ఎంపీడీఓ నారాయణ స్వామి శుక్రవారం తెలిపారు. పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం మండలాలకు చెందిన 200 మంది ఈకేవైసీ చేయించుకోలేదని ఎస్టీఓ తెలిపారన్నారు.

లారీ బోల్తా

మడకశిరరూరల్: ఆర్ అనంతపురం సమీపంలోని కర్ణాకటలోని మురరాయునపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారజామున మడకశిర వైపు నుంచి పెనుకొండకు వెళుతున్న కోళ్ల లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కోళ్లను మరొక వాహనంలో తీసుకెళ్లారు. 70కి పైగా కోళ్ల మృతి చెందాయి.

మలేరియాపై అప్రమత్తత అవసరం

మడకశిర: మలేరియా సోకకుండా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి కోరారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో శుక్రవారం మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని కోరారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. తహసీల్దార్ బాలాంజనేయులు, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.



మడకశిరలో మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విత్తనాలు, మందులు అందుబాటులో ఉంచండి



మాట్లాడుతున్న చైర్మన్ కొండలరాయుడు

పెనుకొండ: మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని మండల అగ్రి చైర్మన్ కొండలరాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏఓ నటరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు.

సవితమ్మకు ఆశాభంగమేనా?

పెనుకొండ: కురుబ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సవితమ్మకు భంగపాటు తప్పదా? అని నియోజకవర్గంలో జోరుగా చర్చసాగుతోంది. అసెంబ్లీ స్థానానికి టీడీపీ తరఫున టికెట్ వస్తుందని సవితమ్మ ఆశించిన విషయం విదితమే. శుక్రవారం పట్టణంలో బీకే ఇంటి వద్ద 'భవిష్యత్తుకు భరోసా' కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి టీడీపీ పరిశీలకుడు నరసింహయ్యయాదవ్ హాజరయ్యారు. అయితే సవితమ్మ మాత్రం సమావేశంలో పాల్గొనకపోగా, ఆమె అనుచరగణం కూడా డుమ్మాకొట్టారు. సవితమ్మ కర్నూలు జిల్లాలో జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో బీకే ఇంటి వద్ద జరిగిన సమావేశంలో పరిశీలకుడు నరసింహయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రూపులు కడితే చర్యలు తప్పవని, క్రమశిక్షణ చర్యలు తప్పవని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయంపై ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ సాగింది. ప్రధానంగా సవితమ్మ అనుచర గణం, సీనియర్ టీడీపీ నాయకులు తమ నాయకురాలికే ఈ హెచ్చరిక అంటూ చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా టీడీపీలో బీకే సవితమ్మ మధ్య ముదిరిన విభేదాలకు తార్కాణంగా నియోజకవర్గ పరిశీలకుడు నరసింహయ్య యాదవ్ చేసిన ఈ వ్యాఖ్యలు పెనుకొండ టీడీపీలో తీవ్ర దుమారం రేగనుంది. ప్రధానంగా టీడీపీ సీనియర్ నాయకులు ఈ సమావేశానికి పిలుపురాకపోవడంతో ఆగ్రహావేశాలు, ఆవేదనకు లోనయినట్లు తెలిసింది.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

పావగడ: ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలందించి వృత్తి ధర్మాన్ని కాపాడుకోవాలని వైద్యులకు స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ సూచించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి లో శుక్రవారం వైద్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వైద్య వృత్తి కి ఎక్కువ విలువ ఉందన్నారు. అయితే ఇటీవల వైద్యుల మధ్య గొడవలు చోటు చేసుకున్న సంఘటనలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయని మండిపడ్డారు. వైద్యులే ఒకరికొకరు తగవు లాడుకుంటే ఇక రోగులను ఎవరు కాపాడుతారని ప్రశ్నించారు. సమస్యలు ఉంటే టీహెచ్‌ఓకు తెలియజేయాలన్నారు. ఇక నుంచి వైద్యులు గొడవలు పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. డీహెచ్‌ఓ డా మంజునాథ్, టీహెచ్‌ఓ డా తిరుపతయ్య, పాలనాధికారి డా కిరణ్, వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

రేపు 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష

హిందూపురం టౌన్: మండలంలోని సీ.చెర్లోపల్లిలో ఉన్న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 11న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ శుక్రవారం పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ పరీక్ష సాగుతుందన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే హాల్‌టికెట్లతో హాజరుకావాలని సూచించారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

హిందూపురం టౌన్: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ గంగప్ప, ఎంపీఐ రమణలు అన్నారు. శుక్రవారం స్థానిక పాంచజన్య పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పాంచజన్య పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సత్యనారాయణ శెట్టి, తాయారమ్మ ఎడ్యూకేషనల్ సొసైటీ, లేట్ భాగ్యలక్ష్మి సహకారంతో ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు ఇంటర్‌మీడియట్ చదువు కోసం రూ.10వేల చొప్పున నగదు బహుమతిని అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు స్మిత, నందిత, హెచ్‌ఎం గాయత్రి, ఏఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ హసీనా సుల్తానాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ పట్టణంలోని పలు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫీజులకు అదనంగా పాఠ్యపుస్తకాలు, టైలు, యూనిఫాం, నోటు పుస్తకాలు పాఠశాలలోనే కొనాలని వేలకు వేలకు దండుకుంటున్నారని అన్నారు. విద్యాసంస్థల్లో ఏ మాత్రం మౌళిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, అలాంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రకటించిన జీవో నంబర్ 53 ప్రకారం ఫీజులు వసూలు చేసే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, జయచంద్ర, చంద్రశేఖర్, హర్షకుమార్, లిఖిత్, భగత్, రోహిత్, మహేష్, ప్రసన్న, వినోద్, అభి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు